క్లుప్తంగా

రామాలయానికి భూమిపూజ



వెదురుపాకలో ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ

రాయవరం: వెదురుపాకలోని రెడ్ల రామాలయం పునర్నిర్మాణ పనులకు శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. ఇటికరాల సుబ్రహ్మణ్యశర్మ, అంగర జనార్ధనాచార్యుల అర్చకత్వంలో గ్రామానికి చెందిన చిన్నం వీర వెంకటసత్యనారాయణరెడ్డి, విజయలక్ష్మి దంపతులు పూజలు నిర్వహించారు. ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

కె.గంగవరం: మండలకేంద్రమైన కె.గంగవరంలోని తాడాల రాంబాబు రైస్‌మిల్లు వద్ద శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కాకినాడకు చెందిన రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ తాడాల బుజ్జి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 300 మందికి ఉచితంగా క్లినికల్ పరీక్షలు, జనరల్ స్క్రీనింగ్, దంత పరీక్షలు, ఎముకల, కీళ్ల సంబంధిత రోగులకు పరీక్షలు నిర్వహించి, మందుల పంపిణీ చేశారు. గ్రామస్తులతో పాటు, పరిసర గ్రామాలకు చెందిన రోగులు పాల్గొన్నారు. రామచంద్రపురం పట్టణం, కాజులూరు మండలాల్లో కూడా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామని తాడాల బుజ్జి తెలిపారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న ఆసుపత్రి సిబ్బంది

రామచంద్రపురం రూరల్: మాలపాడు గ్రామంలో మన బాధ్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో కపిలేశ్వరపురం ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యుల పర్యవేక్షణలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ పి.సుధారాణి, కంటి వైద్య నిపుణుల బృందం సుమారు వంద మందికి కంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి కంటి చుక్కలు, మందులు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు బత్తుల ప్రవీణ్‌కుమార్, కట్టా ప్రవీణ్‌కుమార్, కొండలరావు, విజయ్, దుర్గారావు, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్దూ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలతో మెరుగైన పాలన

కాజులూరు: ప్రజలకు సచివాలయాల ద్వారా మెరుగైన పాలన అందించటంతో పాటు, అధికారులు ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శుక్రవారం గొల్లపాలెం, డేగలపేట, బందనపూడి తదితర గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. బందనపూడిలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని, రూ. 21.80 లక్షలతో నిర్మించిన రైతు సేవా కేంద్రాన్ని, రూ.4.5 లక్షలతో నిర్మించిన ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డు, రూ.4.28 లక్షలతో నిర్మించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీలకు ప్రారంభోత్సవం చేశారు. ఇద్దరు బాధితులకు ఆర్థికసాయం అందించారు. సర్పంచ్ డేగల తిరుమలవేణి, తహసీల్దార్ రవీంద్రనాథ్ ఠాగూర్, పీఆర్ ఏఈ భవానీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

అనురాగాల.. రాఖీ



రాఖీలు



మార్కెట్లో రాఖీల కొనుగోలు సందడి

- అంతరాలు లేని అనుబంధానికి ప్రతీక
- అందుబాటులో ఆకట్టుకునే ఆకారాల్లో రాఖీలు
- నేడు రక్షా బంధన్

రాయవరం: సోదరుల మీద ఉన్న అనురాగాన్ని ఆప్యాయతను తెలియజేయడానికి ఏడాదంతా రాఖీ పౌర్ణమి కోసం తోబుట్టువులు ఎదురుచూస్తారు. హాలో బ్రో ఏం చేస్తున్నావు..! హాయ్ సిస్ ఎలా ఉన్నావు.. ఈ పలకరింపుల్లో షార్ట్‌కట్‌లు ఉండొచ్చు కానీ.. ఈ తరం మాత్రం రాఖీ పండగను అనుబంధాలకు ప్రతీకగా జరుపుకుంటోంది. బుడిబుడి అడుగుల ప్రాయం నుంచి.. ప్రాణం ఉన్నంత వరకూ ప్రేమాభిమానాలతో సాగేదే రక్త సంబంధం. అక్కాతమ్ముళ్లు, అన్నాచెల్లెళ్ల ప్రేమానురాగాలకు ప్రతీకగా జరుపుకునేదే రాఖీ పండగ. సోదరి తన సోదరుడు ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరుకుంటే.. సోదరి కట్టిన రక్షాబంధాన్ని స్వీకరించిన సోదరుడు తానెన్నడూ సోదరికి రక్షణగా ఉంటానని ఈ పండగ ద్వారా తెలియజేస్తారు. మానవ సంబంధాల మెరుగుకు, ఆత్మీయుల మధ్య అనుబంధానికి, ఐకమత్యానికి, పరస్పర సహకారానికి చిహ్నంగా రాఖీ పౌర్ణమి నిలుస్తుంది. ఎంతదూరాన ఉన్నా అన్నా తమ్ముళ్లకు రాఖీలు కట్టేందుకు అక్కా చెల్లెళ్లు వస్తుంటారు. విదేశాల్లో ఉన్నవారు సైతం కొరియర్‌లోనూ తమ వారికి రాఖీలు పంపిస్తూ.. అనుబంధాలను చాటుతున్నారు. ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలియజేసుకుంటున్నారు.

శ్రావణమాసం శుక్లపక్షంలో పౌర్ణమి తిథి కావడంతో శనివారం రాఖీ పౌర్ణమిని తోబుట్టువులు ఆనందోత్సాహాలతో జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ పర్వదినాన్ని జంధ్యాల పౌర్ణమిగా పిలుస్తుంటారు. ఉత్తరాదిలో రక్షాబంధన్‌గా పిలవడం పరిపాటి. అక్కాచెల్లెళ్లు కట్టిన రాఖీలతో సోదరుల ముంజేతులన్నీ వివిధ రంగులు, డిజైన్ల రాఖీలతో కళకళలాడుతాయి. అండగా ఉంటామని హామీ ఇస్తూ అన్నదమ్ములు తమకు తోచిన కానుకలు సోదరీమణులకు ఇస్తారు. రక్షా బంధన్‌ను రాఖీ పౌర్ణమి.. జంధ్యాల పౌర్ణమిగా పిలుస్తారు. ఈ పండగతో విద్యార్థినీ విద్యార్థులు, యువతీ యువకుల మధ్య సోదరభావం, నైతిక విలువలు పెరుగుతాయి. ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్ పెరుగుతున్న పరిస్థితుల్లో కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థి సంఘాలు ఈ పండగను ఘనంగా నిర్వహించేందుకు చొరవ చూపాల్సి ఉంది. ఆడ పడుచును మహాలక్ష్మి స్వరూపంగా, పరాశక్తికి ప్రతీకగా భావించే సంస్కృతి భారతీయ సంప్రదాయంలో ఉంది. కష్ట సుఖాల్లో, సుఖ సంతోషాల్లో మేమున్నామనే భరోసాను అక్కాచెల్లెళ్లకు కల్పించడమే రాఖీ బంధం.

ఆకట్టుకునే డిజైన్లలో..

రాఖీ పండగను పురస్కరించుకుని వ్యాపారులు రకరకాల రంగురంగుల రాఖీలను అమ్ముతున్నారు. మార్కెట్‌లో పలు ప్రముఖ ఫ్యాన్సీ దుకాణాల్లో సంప్రదాయ, ఆధునిక రాఖీలు కనువిందు చేస్తున్నాయి. ముఖ్యంగా పిల్లలను ఆకర్షించే రంగురంగుల కామిక్స్ రాఖీలు, బంగారు వర్ణంతో మరికొన్ని ధగధగలాడుతున్నాయి. రుద్రాక్ష రాఖీలు, ప్లాస్టిక్, పూల రాఖీలు, రంగు పూసల రాఖీలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. కాలానుగుణంగా కొత్త డిజైన్లలో రాఖీలు వస్తున్నాయి. ఏటా రాఖీ విక్రయాలు పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. రాఖీలు విక్రయించే షాపులు, స్వీట్ షాపులు, అనుబంధ మార్కెట్లు కిటకిటలాడుతున్నాయి. రూ.10 నుంచి రూ.వందలు, వేలల్లో రాఖీలు మార్కెట్లో లభ్యమవుతున్నాయి.

ఆన్‌లైన్ రక్షాబంధన్

కాలం మారడంతో పాటు రక్షా బంధన్ తీరు మారింది. విద్య, ఉపాధి, ఇతరత్రా కారణాలతో దూర ప్రాంతాల్లో ఉంటున్న సోదరులకు పోస్టు ద్వారా రాఖీలను పంపితే వాటిని కట్టుకొని తోబుట్టువులకు కానుకలు పంపే సంప్రదాయాన్ని పాటిస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానం విస్తృతం కావడంతో ఆన్‌లైన్ ద్వారా రాఖీలను పంపి ఆన్‌లైన్ దద్వారానే కానుకలు స్వీకరిస్తున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా పరస్పరం అభినందనలు తెలుపుకునే వెసులుబాటు ఉంది. పద్ధతులు మారినా రాఖీ అనుబంధం, ఆప్యాయత మాత్రం చెక్కు చెదరలేదు.

విడదీయని బంధం



నాకు ఇరువురు సోదరులు ఉన్నారు. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల బంధం జీవితంలో విడదీయరానిది. ఏటా మా అన్నలకు రాఖీ కడతాను. ఎంత వయసు వచ్చినా అన్నాచెల్లెల అనుబంధం విడదీయలేనిది. ఈ బంధానికి ఏదీ సాటిరాదు.

– ఎం.దుర్గాదేవి, చిరుద్యోగిని, టి.జగన్నాథపురం, అయినవిల్లి మండలం

ఆ బంధం గొప్పది



వృత్తి రీత్యా ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నాను. స్వతహాగా నాకు అన్నయ్యలు, తమ్ముళ్లు లేరు. ఏటా సోదర సమానమైన వ్యక్తికి రాఖీ కడతాను. రక్తసంబంధం లేకపోయినా సోదరుడు అనే భావన చాలా గొప్పగా ఉంటుంది.

– యడ్లపల్లి భువనేశ్వరి, ఎస్‌జీటీ హెచ్‌ఎం, ఎంపీపీఎస్ కూనల్లంక, ముమ్మిడివరం మండలం

పరమ పవిత్ర బంధం



సోదరీ సోదరులు తమ బంధానికి గుర్తుగా రాఖీ పర్వదినం నిర్వహించుకుంటారు. రాఖీ పర్వదినం రోజు రక్షాబంధనం కట్టి, మిఠాయిలు తినిపించి, సోదరుల నుదుటన తిలకం దిద్దుతారు. కష్టసుఖాల్లో తోడుగా నిలవాలని ఆశిస్తూ ఈ పర్వదినాన్ని నిర్వహించుకుంటాం. భగవంతుడు సోదరుల రూపంలో రక్షణగా నిలుస్తాడు.

– బ్రహ్మకుమారి మాధవి, బ్రహ్మకుమారీ ఆశ్రమం, పసలపూడి, రాయవరం మండలం

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు



ప్రత్యేకాలంకరణలో ద్రాక్షారామ మాణిక్యాంబ అమ్మవారు



ద్రాక్షారామ-కోటిపల్లి ప్రధాన రహదారిపై కనకదుర్గమ్మ ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు



గొల్లపాలెం దుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న మహిళలు

రామచంద్రపురం రూరల్: శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు ఆలయాల వద్ద మహిళలు బారులు తీరారు. ద్రాక్షారామలోని భీమేశ్వరాలయంలో కొలువైన మాణిక్యాంబ అమ్మవారిని దర్శించుకునేందుకు ఉదయం నుంచి భక్తులు తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని కుంకుమ పూజలు చేశారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, విశేష పూజలు నిర్వహించారు. నరసాపురపుపేట, ఓదూరు, ఉండూరు, చోడవరం, వెంకటాయపాలెం, తాళ్లపొలం తదితర గ్రామాల్లో దుర్గమ్మ అమ్మవార్ల ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. ద్రాక్షారామలోని కోటిపల్లి రోడ్డులో కనక దుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద మహిళలు పెద్దఎత్తున బారులు తీరారు.

రామచంద్రపురం: నియోజకవర్గంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రత పూజలను మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీ వ్రతం కావటంతో పలు దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఇంటి వద్ద వ్రతమాచరించిన మహిళలు సాయంత్రం ఆలయాల్లో అమ్మవారిని దర్శించుకున్నారు. పట్టణంలోని శివాలయం వీధిలోని కనక దుర్గమ్మ అమ్మవారి ఆలయం, కొత్తూరు రోడ్డులోని అమ్మవారి ఆలయాల్లో మహిళలు విశేష పూజలు చేశారు. పట్టణంలోని ఆగస్త్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న కోదండ రామాలయంలో అమ్మవార్లను ప్రత్యేకాలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. జ్ఞాన సరస్వతీదేవి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ముత్తయిదువులకు వాయినాలు

కపిలేశ్వరపురం: మండపేట నియోజకవర్గంలోని గ్రామాల్లో శుక్రవారం మహిళలు భక్తి శ్రద్ధలతో వరలక్ష్మి వ్రతాన్ని ఆచరించారు. ముత్తయిదువులకు వాయినాలను సమర్పించారు. అమ్మవార్ల ఆలయాలను సందర్శించి పూజలు చేశారు. మండపేట పట్టణంలోని ఆలయాలు కిటకిటలాడాయి. రూరల్ గ్రామాలైన ద్వారపూడి, తాపేశ్వరం, కేశవరం, పాలతోడు, వెలగతోడు, మెర్నిపాడు, వేములపల్లి, మారేడుబాక, ఏడిద, ఇప్పనపపాడు, చిన ద్వారపూడి, జెడ్ మేడపాడు గ్రామాల్లో వాయినాల అందజేతతో సందడిగా మారాయి. కపిలేశ్వరపురం మండలంలోని తాతపూడి, కపిలేశ్వరపురం, అంగర, పడమర ఖండ్రిక, వెదురుమూడి, వల్లూరు, నేలటూరు, అచ్యుతాపురం, నిడసనమెట్ట, వడ్లమూరు, నల్లూరు, కాలేరు, నాగులచెరువు, వాకతిప్ప, అద్దంకివారిలంక, కేదారిలంక గ్రామాల్లోని దేవతామూర్తుల ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

ఆలయాలకు శ్రావణ శోభ

కాజులూరు: శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా అమ్మవారి ఆలయాలు కిటకిటలాడాయి. శ్రావణ పౌర్ణమి ముందు వచ్చిన ఈ శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు ప్రత్యేకంగా ఆచరించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో మహిళలు వ్రతాన్ని ఆచరించి, ఆలయాల్లో అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని 26 గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.

శ్రావణలక్ష్మీ నమోస్తుతే..

రాయవరం: శ్రావణమాసం శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రావణమాసం శుక్లపక్షంలో పౌర్ణమి ముందు వచ్చే వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు ఆచరించారు. పలువురు మహిళలు వేకువజామునే నిద్రలేచి వ్రతం నిర్వహించే ప్రదేశంలో పిండితో ముగ్గును వేసి, కలశానికి పసుపురాసి నీటితో నింపి కలశంపై మామిడి ఆకులు, కొబ్బరికాయను, కొత్త రవికెను ఉంచి వ్రతమాచరించారు. అష్టోత్తర శతనామాలతో వరలక్ష్మీదేవిని పూజించి షడ్రసోపేతమైన మహా నైవేద్యాన్ని అమ్మవారికి నివేదించారు. అనంతరం చుట్టుపక్కల ఉన్న ముత్తయిదువులను పిలిచి వాయనాలు, తాంబూలాలు అందజేశారు. సాయంత్రం సమయంలో వ్రతమాచరించిన మహిళలు దేవాలయాలకు వెళ్లి పూజలు చేశారు.

గాజుల అలంకరణలో పార్వతీదేవి

రాయవరం: స్థానిక పార్వతీ సమేత రాజేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం పార్వతీదేవిని గాజులతో అలంకరించారు. వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని అమ్మవారిని వివిధ రకాల రంగుల కలిగిన ఐదు వేల గాజులతో అలంకరించారు. ఆలయ అర్చకులు విలపర్తి ఫణిధర్‌శర్మ, శశిధర్‌శర్మ అమ్మవారిని గాజులతో అలంకరించారు. ఉదయం అమ్మవారిని పసుపుకొమ్ములు, పూలతో అలంకరించారు. రెండు రూపాల్లో అమ్మవారిని దర్శించుకున్న భక్తులు భక్తిపారవశ్యాన్ని పొందారు. సోమేశ్వరంలోని శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని అమ్మవారిని, స్వామి వారిని వివిధ రకాల పుష్పాలతో ఆలయ పురోహితులు పరిటాల సుబ్రహ్మణ్యశర్మ నేత్రపర్వంగా అలంకరించారు.



గాజులతో అలరారుతున్న పార్వతీదేవి



సోమేశ్వరంలో బాలా త్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి

మాల మహానాడు నూతన కమిటీ ఎన్నిక



ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

కె.గంగవరం: మండల మాల మహానాడు నూతన కమిటీ ఎన్నిక గురువారం రాత్రి ఏకగ్రీవంగా జరిగింది. కె.గంగవరంలో జరిగిన ఈ ఎన్నికలో అధ్యక్షులుగా ఈర్ల రాజుబాబు, ఉపాధ్యక్షులుగా తోకల శ్రీను, గుబుపే దొరబాబు, ప్రధాన కార్యదర్శిగా దానం వెంకన్న, ట్రెజరర్‌గా తోకల వెంకటరమణ, జాయింట్ కార్యదర్శులుగా ధార సత్యనారాయణ, ఇనకోటి వెంకటరమణ, కాటి సంజీవ్, పెట్టా రాజేష్, గౌరవాధ్యక్షులుగా పెట్టా శ్రీనివాస్, రవ్వా భూషణం, తారపట్ల ఆనందరావు, గౌరవ సలహాదారులుగా పాము భాస్కరరావు, సాదే నారాయణ, బత్తుల అప్పారావు, చిట్టిరాజు, కాటి సుబ్రహ్మణ్యం, దున్న అన్నవరం, బత్తుల జాగృత్‌కుమార్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ, మండల పరిధిలో దళితుల అభ్యున్నతికి, సమస్యల పరిష్కారానికి పార్టీలకతీతంగా కృషి చేస్తామన్నారు.

చేనేత దినోత్సవం మరుసటి రోజే వైఎస్సార్ సీపీలో చేరిక



కండువాలు కప్పి నందీశ్వరరావు, వెంకటేశ్వరరావును పార్టీలోకి ఆహ్వానిస్తున్న సూర్యప్రకాశ్

రామచంద్రపురం రూరల్: రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ రామచంద్రపురం మండలంలోని ఆదివారపుపేట గ్రామంలో గురువారం చేనేత దినోత్సవ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్‌తో కలసి నిర్వహించారు. మరుసటి రోజైన శుక్రవారం ఇద్దరు చేనేత కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరడం చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళితే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆదివారపుపేట గ్రామంలో చంద్రబాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంలో పార్టీ చేనేత విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు, సొసైటీ మాజీ ప్రెసిడెంట్ ఉప్పు అర్ధనారీశ్వర బులిరాజు నేతృత్వంలో అల్లక నందీశ్వరరావు, మాడా వెంకటేశ్వరరావు పార్టీలో చేరారు. వీరికి సూర్యప్రకాశ్ పార్టీ కండువాలు కప్పి, సాదరంగా ఆహ్వానించారు. అనంతరం సూర్యప్రకాశ్ మాట్లాడుతూ, చంద్రబాబు మోసపు హామీలపై నిలదీయాలని గ్రామస్తులను కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు అల్లక బుజ్జి, ఇనుమర్తి సత్యనారాయణ, లక్కింశెట్టి బాబీ, ఎంపీపీ అంబటి భవాని, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు యల్లమిల్లి సతీష్ కుమారి, ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, సర్పంచ్ కట్టా గోవిందు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చెస్ పోటీలు



చెస్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

కపిలేశ్వరపురం (మండపేట): స్థానిక అన్నపూర్ణ హైస్కూల్ ప్రాంగణంలో శుక్రవారం మాస్టర్స్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో చెస్ ప్రతిభ పోటీలు నిర్వహించారు. అండర్-15 మండల స్థాయి చెస్ టోర్నమెంట్ బీఎల్ఎన్ వరాహులు సమన్వయంలో నిర్వహించిన ఈ పోటీల్లో 50 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మొదటి స్థానంలో పూడి వినయ్ కార్తీక్, రెండో స్థానంలో తేలు వీరవెంకటసత్యనారాయణ, మూడో స్థానంలో సీరాం గణేష్ వీరేంద్ర గుప్త నిలిచారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వారు త్వరలో నిర్వహించనున్న ఏపీ స్టేట్ ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో ఆడనున్నారని, వారికి మాస్టర్స్ చెస్ అకాడమీ స్పాన్సర్‌గా చేయూత ఇస్తారని నిర్వాహకులు తెలిపారు.

జాతీయ జెండా ఔన్నత్యాన్ని చాటాలి

కపిలేశ్వరపురం: భారత జాతీయ జెండా ఔన్నత్యాన్ని ప్రతి ఒక్కరూ చాటాలని బీజేపీ నాయకులు అన్నారు. కపిలేశ్వరపురంలో పార్టీ మండల అధ్యక్షుడు నామాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమ సన్నాహక సమావేశం నిర్వహించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ, కార్యవర్గ సభ్యుడు కొట్టువాడ హరిబాబు మాట్లాడుతూ ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవాల్లో భాగంగా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై మువ్వన్నెల జెండా ఎగురవేయాలని కోరారు. అందులో భాగంగా ఆగస్టు 9 నుంచి 15 వరకూ తిరంగా ర్యాలీలు, కాగడా ప్రదర్శనలు చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రామచంద్రపురం రూరల్ అధ్యక్షుడు శ్రీకృష్ణ, నాయకుడు తోరంరాము పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

కపిలేశ్వరపురం (మండపేట): కేశవరంలో శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు శుక్రవారం తెలిపారు. కేశవరం ఫీడర్ పరిధిలోని ప్రాంతం విద్యుత్ లైన్ల వెంబడి చెట్టు కొమ్మలను తొలగించే పనులు చేపట్టనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని రత్నాలరావు తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట



వేములపల్లిలో పోలీసు సిబ్బందికి సూచనలు ఇస్తున్న సీఐ దొరరాజు

కపిలేశ్వరపురం (మండపేట): అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసే లక్ష్యంతో ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్టు మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలపై ఆయన ఆధ్వర్యంలో మండపేట మండలం వేములపల్లిలో శుక్రవారం కార్డన్ అండ్ సెర్చ్ పేరుతో తనిఖీ చేపట్టారు. గ్రామంలోని వీధుల్లో, ఖాళీ ప్రదేశాల్లోనూ వాహనాలను తనిఖీ చేయగా నంబర్లు, రికార్డులు లేని పలు వాహనాలు పట్టబడ్డాయని సీఐ దొరరాజు తెలిపారు. కార్యక్రమంలో మండపేట రూరల్, అంగర, రాయవరం ఎస్సైలు వి. కిషోర్, జి.హరీష్‌కుమార్, డి.సురేష్ బాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



టపా పుల్లేశ్వరరావు

కపిలేశ్వరపురం (మండపేట): ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎంప్లాయీస్, పెన్షనర్స్ విభాగం కార్యదర్శి టపా పుల్లేశ్వరరావు తెలిపారు. ఇటీవల పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో పుల్లేశ్వరరావును రాష్ట్ర కార్యదర్శిగా ప్రకటించారు. పోస్టల్ శాఖలో మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలోని పలు ప్రాంతాల్లో 35 ఏళ్లపాటు సేవలందించారు. నియామకం అనంతరం శుక్రవారం పుల్లేశ్వరరావు మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలతో ఉద్యోగులు, పెన్షనర్లు తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. పెన్షనర్ల సమస్యలను అధ్యయనం చేసి ఉద్యమ కార్యాచరణకు కృషి చేస్తామని పుల్లేశ్వరరావు తెలిపారు.

ముగిసిన తల్లిపాల వారోత్సవాలు

కపిలేశ్వరపురం: మండపేట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 1న ప్రారంభమైన తల్లిపాల వారోత్సవాలు ముగిశాయని ప్రాజెక్ట్ అధికారి అధికారి గజలక్ష్మి తెలిపారు. ప్రాజెక్టు పరిధిలోని మండపేట పట్టణం, మండపేట రూరల్, కపిలేశ్వరపురం, రాయవరం మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు ఆధ్వర్యంలో అనుబంధ ప్రభుత్వ శాఖల సహకారంతో అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించామన్నారు. పౌష్టికాహార ప్రాధాన్యతపై నిర్వహించిన సదస్సులు విజయవంతం చేసిన ఐసీడీఎస్, అనుబంధ శాఖల అధికారులు, సిబ్బందికి గజలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు.